

'విశ్వకర్మ'తో చేయూత

చేతి వృత్తులవారికి ఆర్థిక చేయూతనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తోంది.

8లో▸

అడిషనల్ ఎస్పీగా శివకుమార్

నిర్మల్: జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)గా కె.శివకుమార్ శనివారం నియమితులయ్యారు. జిల్లా పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న ఈస్థానంలో శివకుమార్‌ను నియమిస్తూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్ ఉత్తర్వులు జారీచేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /20.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

19న జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో ఈనెల 19న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాక్సింగ్ ప్రెసిడెంట్, సెక్రెటరీ శ్రీధర్, చందుల స్వామి తెలిపారు. ఇందులో పాల్గొనేవారు 2010, జనవరి 1 నుంచి 2011, డిసెంబర్ 31 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకు ఆధార్, బర్త్ సర్టిఫికెట్‌తో సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9966677105 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని జేవీఎన్‌ఆర్ పాఠశాల మైదానంలో లక్కీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 45 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ బీఎల్ఎన్.రెడ్డి, ఆర్గనైజర్ కోచ్ సుదర్శన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ బి కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. 2024, మార్చిలో ఇంటర్ పూర్తి చేయనున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ వెంట పదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మెమో జిరాక్స్, ఆధార్ కార్డు, ఫొటో తీసుకురావాలని సూచించారు. మిగతా వివరాలకు సంస్థ ప్రతినిధిని 9493553821, 8074065803 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వచన కవితలకు ఆహ్వానం

భైంసాటౌన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక కవితా సంకలనం నేపథ్యంలో వచన కవితలు ఆహ్వానిస్తున్నట్లు భైంసా డివిజన్ కార్యదర్శి జాదవ్ పుండలిక్‌రావు పాటిల్ తెలిపారు. ఆసక్తిగల కవులు తమ కవితలను అందించాలన్నారు. నిర్మల్ జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలు, చారిత్రక అంశాలు, తాత్విక చింతన మొదలైనవాటిపై రచనలు ఉంచాలన్నారు.

నేడు అష్టావధానం

బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి ఆశ్రమంలో ఆదివారం అష్టావధానం నిర్వహించనున్నట్లు కవి జాదవ్ పుండ్లిక్‌రావు తెలిపారు. అవధానిగా బ్రహ్మశ్రీ డాక్టర్ పట్వర్ధన్, పృచ్ఛకులుగా డాక్టర్ కోవెల శ్రీనివాసాచార్య, జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, కడారి దశరథ్, మురళీధర్, చిన్నన్న, పోతన్న, పీసర శ్రీనివాస్‌గౌడ్, బసవరాజు పాల్గొంటారని వివరించారు.

ఫిషరీ ట్రైనింగ్ ప్రారంభం

కడెం: యాక్సెంచర్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలపమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఈడీఐఐ) సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత ఫిషరీస్ ప్రాసెసింగ్ శిక్షణను శనివారం ప్రారంభించినట్లు ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ దేవేందర్ నాయక్ తెలిపారు. చేపలు, రొయ్యల పచ్చడి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై 26 రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేసి వారికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు చూపిస్తామని వెల్లడించారు. ఇందులో ఐకేపీ సీసీ స్వామి, నర్సయ్య, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి

భైంసాటౌన్: పట్టణ ప్రజలు, వ్యాపారులు ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలో మొత్తం 729.53 లక్షల ఆస్తిపన్ను బకాయిలు ఉండగా, వీటిలో రూ.189.79 లక్షలు మాత్రమే చెల్లించారని తెలిపారు. మిగిలిన 539.74 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలను మార్చి 31లోగా చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్లలో లేదా బిల్ కలెక్టర్లకు చెల్లించాలన్నారు. లేని పక్షంలో చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కళ్యాణం.. వైభోగం

'పచ్చాని పందిట్ల ముత్యాల పోలు.., పాలాపారుక తీసుడే.., కుండలు దీసి, ముగ్గులు పూసి, ఐరేండ్లను జేసుడే... ఒడిబియ్యం పోసుడే... సన్నబియ్యం సాలుపోసి జోడు పీటలేసుడే... మైలాపోలు తీసుడే... చెక్కరి కుడుకలు పోసుడే... పోలు వోసిన... ఏడవకు ఏడవకే నా ముద్దు బిడ్డా, నవ్వుతూ దాటాలె పుట్టింటి గడ్డ' అంటూ తెలంగాణ పెళ్లితంతు గురించి ఓ కవి చక్కగా రాశాడు.

ఒకప్పుడు పెళ్లి అంటే ఇంటి ముందు 12 గుంజల పచ్చని పందిరి.. మామిడి తోరణాలు, ఫొటోలు, వీడియోలు, ఆల్బమ్, తలంబ్రాలు దంచడం, కూరాళ్లు పట్టడం, ఐరేండ్లు ఎత్తడం, కళ్యాణం, రిసెప్షన్ ఇలా ఉండేవి. కానీ మారుతున్న కాలంతో పెళ్లి తంతు కూడా మారుతోంది. మారుతున్న కళ్యాణ వేడుక తీరుపై సండే స్పెషల్ స్టోరీ..

- మారుతున్న మ్యారేజెస్ ట్రెండ్
- వధూవరుల అభిరుచికి అనుగుణంగా వేడుక
- గ్రాండ్ సెలబ్రేషన్స్‌కే మొగ్గు



నిర్మల్‌ఖిల్లా: మాఘమాసం వచ్చేసింది. వివాహాల సీజన్ మొదలైంది. జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్నాయి. జిల్లాలో ఉన్న ఫంక్షన్ హాళ్లు ఇప్పటికే బుక్ అయ్యాయి. జీవితంలో ఒకేసారి జరుపుకునే ఈ వేడుక గుర్తుండిపోయేలా భిన్నంగా జరుపుకునేందుకు నేటితరం ఆసక్తి చూపుతోంది. వధూవరుల అభిరుచి మేరకే పెద్దలు కూడా గ్రాండ్‌గా వేడుకలు నిర్వహిస్తున్నారు. రొటీన్‌గా కాకుండా విభిన్నంగా ఉండాలని ఖర్చుకు వెనకాడకుండా ఆడంబరంగా జరిపిస్తున్నారు.

నాడు 16 రోజుల పండుగ..

ఒకప్పుడు పెళ్లి అంటే ఐదురోజుల నుంచి పదహారు రోజులపాటు పండుగలా జరుపుకునేవారు. తమ కుటుంబ కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాలకు తగినట్టుగా ఆకాశమంతా పందిరి.. భూదేవి అంతా వివాహ వేదికను సిద్ధం చేసి బంధుమిత్రులందరినీ ఒకే చోటకు చేర్చి పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తెలను దీవించేవారు. అయితే కాలానికి అనుగుణంగా వివాహ సంప్రదాయాల్లో చాలా మార్పులొచ్చాయి. ఇప్పుడు కేవలం మూడు రోజుల్లోనే మూడు ముళ్ల తంతును ముగించేస్తున్నారు. ఈమూడు రోజుల్లోనూ కూడా హంగూ ఆర్భాటాలకు మాత్రం వెనుకాడటంలేదు. సినిమా తీసినంతగా పెళ్లి జరిపిస్తున్నారు. వివాహ వేదిక మొదలుకొని, కెమెరాలో చిత్రీకరణ వరకు ప్రతీ ఒక్క అంశాన్ని ప్లాన్ చేస్తున్నారు. కొంతమంది డెస్టినేషన్ వెడ్డింగ్ పేరుతో అందమైన ప్రాంతాలకు వెళ్లి వివాహాలు జరుపుకుంటుండగా, మరికొందరు తాము ఉన్న చోటనే భారీసెట్టింగ్స్ వేసి మరో ప్రపంచాన్ని సృష్టిస్తున్నారు.

సంబంధం కుదిరిన నాటినుంచే..

పెళ్లి చూపుల్లో అమ్మాయి అబ్బాయి ఒకరినొకరు చూసుకుని నచ్చిన తర్వాత ఇరు కుటుంబాల వారికి సంబంధం ఓకే అయిందంటే చాలు.. ఆనాటి నుంచి పెళ్లి వేడుక వరకు ప్రతీరోజు సందడి నెలకొంటోంది. ప్రస్తుతం సమాజంలో పెళ్లి వేడుకలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎంగేజ్మెంట్, ప్రీవెడ్డింగ్ షూట్, బ్యాచ్‌లర్ పార్టీ, మంగళస్నానం, పెళ్లి పందిరి, మంగళసూత్ర ధారణ అప్పగింతలు, రిసెప్షన్ పార్టీ వంటివన్నీ ఘనంగా సెలబ్రేట్ చేసుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

వివాహ వేదికలోనూ క్రియేటివిటీ...

గతంలో వివాహ వేదిక అనగానే పందిరి గుంజలు, మామిడి తోరణాలు గ్రామీణ ప్రాంతాల్లో కనిపించేవి. ప్రస్తుతం ట్రెండు మారింది ఫంక్షన్ హాళ్లలో పెళ్లి వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పందిరి సెట్టింగ్ చేసేందుకు పలు రకాల వేదికలను ఈవెంట్ మేనేజర్లు చూపుతుండగా వాటిల్లో నచ్చిన వాటిని ఎంపిక చేసుకొని వాటిని తయారు చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా మరి కొంతమంది తమ అభిరుచితో పర్యావరణహితమైన అరటి ఆకులు, కొబ్బరి ఆకులు, మామిడి తోరణాల సహజ సిద్ధమైన ప్రకృతిలో లభించే చెట్టుకొమ్మలు, ఆకులు, పలు రకాలైన పూలతో కూడిన పెళ్లి పందిరి తయారు చేయిస్తున్నారు.

సినిమా షూటింగ్‌ను తలపించేలా..



ప్రీవెడ్డింగ్ షూట్ పేరుతో వధువు, వరుడు ప్రకృతి ఒడిలో డ్రోన్ కెమెరాలు, పలు కాస్ట్యూమ్స్ వినియోగిస్తూ కవర్ సాంగ్ షూటింగులు చేస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంత వాతావరణం ఉట్టిపడేలా పల్లెల్లో, పంట పొలాల్లో షూట్ చేస్తున్నారు. సహజ సిద్ధ వాతావరణంలో తమ అభిరుచులకు అనుగుణంగా జీవితాంతం మధుర స్మృతులను మిగిల్చేలా అనుభూతులను కెమెరాలు బంధించాలని ఆశిస్తున్నారు. వధువు వరుడు సినిమా హీరో హీరోయిన్ తరహాలో పాటలకు డ్యాన్సులు పలు లొకేషన్లలో కొత్త తరహాలో షూట్ చేస్తున్నారు.



కడెం తీరంలో ప్రీ వెడ్డింగ్ షూట్

ఇరు కుటుంబాల అభిరుచి మేరకే...



వధువు వరుడు, ఇరు కుటుంబాల అభిరుచి మేరకు పలు లొకేషన్లలో ప్రీ వెడ్డింగ్ షూట్ నిర్వహిస్తున్నాం. తమ జీవితాల్లో ఒకే ఒక్కసారి జరిగే ఈ వేడుక పది కాలాలపాటు పదిలంగా గుర్తుండి పోవాలంటే విభిన్నంగా షూట్ చేయాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాల్లో, చెరువులు, జలపాతాలు నదుల సమీపంలో వధువువరులతో షూటింగ్ చేస్తున్నాం. వారి అభిరుచి మేరకే ప్రస్తుతం ఈ ట్రెండ్ కొనసాగుతోంది.

– రామరాజ్ కాంద్రే, వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్, నిర్మల్

వెరైటీ కోరుతున్నారు...



జిల్లాలో పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. వధువు వరుడు వారి కుటుంబ సభ్యులు పెళ్లి పందిరి, మంగళ స్నానం వేదిక, మెహందీ కార్యక్రమాల్లో భిన్నత్వంతో కూడిన స్టేజీ డెకరేషన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. వాటికనుగుణంగా కొత్త కొత్త డిజైన్లు భిన్నత్వాన్ని చూపే క్రియేటివ్ ఆలోచనలతో కూడిన వేదికలను సిద్ధం చేస్తున్నాం. వారి అభిరుచులకు అనుగుణంగా వేడుక ప్రత్యేకతను సంతరించుకునే విధంగా వేదికలను నిర్మిస్తూ కస్టమర్స్‌ను సంతృప్తిపరుస్తున్నాం.

– బి.సంతోష్, వెడ్డింగ్ డెకరేటర్, ఈవెంట్ మేనేజర్, నిర్మల్

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై వేటు

- ప్రధానోపాధ్యాయునికి మెమో



సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్ రూరల్: కుబీర్ మండలం పల్సి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కె.సాగర్‌ను సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. టీ(కీ)చకులు శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు జిల్లా సంక్షేమాధికారి విచారణ నివేదిక, మండల విద్యాధికారి ప్రాథమిక నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించి, సరిగా పర్యవేక్షణ చేయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

విద్యార్థులకు షీటీం అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుమలత

కుభీర్:పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులు ఏది మంచి, ఏది చెడు అనేవాటిపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఎస్సై సుమలత అన్నారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మండలంలోని పల్సి ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు మొబైల్ వినియోగం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చదువు ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సోషల్ మీడియాతో నేరాలు, వాటి బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆడవాళ్లు, పిల్లలపై జరుగుతున్న నేరాలు, వాటి శిక్షలు, బాలల సంరక్షణ, వారి హక్కులు, సైబర్ నేరాల గురించి వారికి వివరించారు. ఎలాంటి ఇబ్బంది ఏర్పడినా వెంటనే పోలీస్‌శాఖకు 100కు ఫోన్ చేయాలని తెలిపారు. లేదంటే షీటీం నంబర్‌కు 8712659550 కూడా ఫోన్ చేయాలని పేర్కొన్నారు. ప్రధాన ఉపాధ్యాయుడు సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్



మాట్లాడుతున్న భూమన్నయాదవ్

నిర్మల్ రూరల్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలి అన్నారు. పీఈటీ, భాషా పండితులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. బడుల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, గోవింద నాయక్, శ్రీనివాస్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం

- డీడబ్ల్యూవో నాగమణి



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో నాగమణి

లక్ష్మణచాంద: పౌష్టికాహారం ప్రతి ఒక్కరికీ అవసరం అని డీడబ్ల్యూవో నాగమణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వరల్డ్ విజన్ ఇండియా, జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'ఫ్రంట్ లైన్ వర్కర్స్‌ని' బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీడబ్ల్యూవో హాజరై మాట్లాడారు. పిల్లల చదువు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. బాలల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మంచి భవిష్యత్ అందించాలని సూచించారు. సూపర్‌వైజర్ భాగ్యవతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పౌష్టికాహారంపై మానిటరింగ్ చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్ సమావేశంలో 'ఏలేటి'



సమావేశంలో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: ఢిల్లీలో నిర్వహించిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందులో తెలంగాణలో బీజేపీ గెలుస్తుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రస్తుతం 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని.. అన్ని కుదిరితే త్వరలో తెలంగాణలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు.

ఆర్టీవోగా దుర్గాప్రసాద్

నిర్మల్:జిల్లా రవాణాశాఖలో శనివారం భారీగా బదిలీలు చేపట్టారు. జిల్లా రవాణాశాఖ అధికారిగా గ్రూప్–1 అధికారి దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఆర్టీవోగా విధులు నిర్వహించిన ఎంవీఐ అజయ్‌కుమార్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా బోధన్ సమీపంలోని సాలూర చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు. నిర్మల్ ఎంవీఐగా మహేందర్, ఏఎంవీఐగా ముర్తుజాఅలీ నియమితులయ్యారు.

'పది' ఇంటర్నల్స్ తనిఖీ

- మానిటరింగ్ బృందాల ఏర్పాటు
- ఈనెల 21వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరిశీలన
- జిల్లా వ్యాప్తంగా 27 టీంల ఏర్పాటు



తానూర్ పాఠశాలలో టీం సభ్యులు

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల రికార్డుల పరిశీలనకు విద్యాశాఖ మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేసింది. వీరు ఎఫ్ ఏ–1 (ఫార్మటివ్ అసెస్మెంట్) నుంచి ఎఫ్ఏ–4 వరకు ప్రతీ సబ్జెక్టులో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు(20 మార్కులు), టెక్ట్స్ బుక్స్ రైటింగ్, ప్రాజెక్టు వర్క్ వంటి వాటిని తనిఖీ చేసి 20 మార్కులు కేటాయిస్తారు. విద్యార్థులు ఈ రికార్డులు సరిగా రాశారా లేదా? సదరు సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన విధంగా మార్కులు వేశారా లేదా? అనే అంశాలను పరిశీలిస్తారు

27 బృందాల ఏర్పాటు

జిల్లాలో 10వ తరగతి విద్యార్థుల రికార్డులను పరిశీలించడానికి 27 టీం(మానిటరింగ్ బృందాలు)లను ఏర్పాటు చేశారు. వీరందరికీ ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చారు. ఈనెల 16 నుంచి 21 వరకు తమకు కేటాయించిన పాఠశాలలను తనిఖీ చేస్తాయి. ఒక్కో టీంకు 8 నుంచి 10 వరకు పాఠశాలలను కేటాయించినట్లు జిల్లా పరీక్షల సహాయ అధికారి పద్మ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి మొత్తం 8,923 మంది పదో తరగతి విద్యార్థులు మార్చి 18 నుంచి వార్షిక పరీక్షలు రాయనున్నారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించి స్లిప్ టెస్టుకు ఐదు మార్కులు, ప్రాజెక్టు వర్క్‌కు 5 మార్కులు, టెక్ట్స్ బుక్స్ రైటింగ్‌కు 5 మార్కులు, పుస్తక సమీక్షకు 5 మార్కులు కేటాయించనున్నారు. విద్యార్థుల రికార్డులు సరిగా రాశారా లేదా.. ఉపాధ్యాయులు ఎక్కువ లేదా తక్కువ మార్కులు కేటాయించారా.. తదితర వివరాలను టీం సభ్యులు పరిశీలించి సరి చేస్తారు.

29 వరకు వెబ్‌సైట్ లో నమోదు

ఈనెల 21 వరకు తనిఖీ చేసిన బృందాలు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల మార్కులను ఈనెల 22 నుంచి 29 వరకు నమోదు చేస్తారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల రికార్డుల పరిశీలనకు పాఠశాలకు వచ్చే రోజు టీం సభ్యులకు రికార్డులను అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ టీంలో ఒక ప్రధానోపాధ్యాయుడితోపాటు ఒక లాంగ్వేజ్ టీచర్, మరో నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయుడిని నియమించారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులు ఉండగా, 80 మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు మానిటరింగ్ బృందాలు పరిశీలన చేసిన అనంతరం వెబ్‌సైట్‌లో నమోదు చేసిన మార్కులు కలుపుతారు.

రికార్డులు అందుబాటులో ఉంచాలి

ఈనెల 16 నుంచి 21 వరకు మానిటరింగ్ టీంలు పదో తరగతి విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల రికార్డులను అందుబాటులో ఉంచాలి. ఇప్పటికే సంబంధిత తేదీలను ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించాం. ఈనెల 22 నుంచి 29 వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో మార్కులు నమోదు చేస్తారు. తనిఖీలకు వచ్చిన టీంలకు ఉపాధ్యాయులు సహకరించాలి.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

తాగునీటి సమస్య రానివ్వొద్దు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీల్లో నిత్యం పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటును పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గ్రామ సభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ, వ్యయాలపై సమీక్షించాలని సూచించారు. ఈనెలాఖరుకు వందశాతం ఇంటి పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరందాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈజీఎస్ ద్వారా చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీల పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం గ్రామ, మండలాల వారీగా వివిధ అంశాల ప్రగతిపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

నిర్మల్ చైన్‌గేట్: ఈనెల 21న జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న సేవాలాల్ జయంతి ఉత్సవం పోస్టర్లను కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ శనివారం రాత్రి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలిపారు. బంజారాలు అధికసంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను డీఆర్డీవో విజయలక్ష్మికి అప్పగించారు. ఇందులో డీటీడీవో అంబాజీజాదవ్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం



శిశువును అందిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ గ్రామానికి చెందిన సిడాం నీలాబాయి నిండుగర్భిణి. శనివారం పురిటినొప్పులు రావడంతో 108లోమండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రిమ్స్‌కు 108లో తరలిస్తుండగా పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ సాయినాథ్, పైలెట్ ఆత్రం అశోక్ వాహనంలోనే పురుడుపోశారు. దీంతో నీలాబాయి మగబిడ్డకు జన్మనిచ్చింది.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన ఆత్రం రోహిత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై కలీం తెలిపారు. శుక్రవారం మహారాష్ట్రకు చెందిన మహిళ మెడలో నుంచి చైన్‌ను దొంగతనానికి యత్నించి పారిపోయాడు. పోలీసులు నిందితున్న పట్టుకుని అరెస్ట్ చేసినట్లుగా తెలిపారు.

ఇల్లు దగ్ధం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఆలిగూడ గ్రామంలో మడావి చందుకు చెందిన ఇల్లు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి ఇంట్లో దీపం పెట్టుకొని కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు దీపాన్ని పడేయడంతో మంటలు బట్టలకు అంటుకున్నాయి. నిద్రలేచిన కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంతో రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నాడు.

ఎలక్ట్రికల్స్ దుకాణంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వాఘ్మారే ఎలక్ట్రికల్స్ దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణ యజమాని శ్రీమంత్ వాగ్మారే వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో యజమాని దుకాణం మూసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం దుకాణం పక్కనే గల హోటల్ యాజమని దుకాణం షెటర్ ఓపెన్ చేసి ఉందని ఫోన్‌లో యజమానికి సమాచారం అందించాడు. అక్కడకు వెళ్లి చూడగా దుకాణంలోని రాగి తీగలు చోరీకి గురైనట్లుగా గుర్తించాడు. ఇందులో కొత్త రాగి వైరు 3క్వింటాళ్ల వరకు, పాత రాగి వైరు 40 నుంచి 50 కిలోల వరకు ఉన్నట్లుగా పేర్కొన్నారు. వాటి విలువ దాదాపు రూ.5లక్షల వరకు ఉంటుందని తెలిపాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లుగా బాధితుడు తెలిపాడు.

గూడెం.. గూడు కట్టుకుంది!

ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తారు. కట్టుబాట్లకు కట్టుబడి పని చేస్తారు. కానీ ఓ గూడెంలో పట్టు తప్పిన పటేల్‌ను కాదని ఊరే తరలిపోయింది. కొత్తగా గూడెం నిర్మించుకుంది. దీంతో ఆ గూడెంలో కట్టుబాట్లు పెట్టిన పటేల్, ఆయన బంధువు మాత్రమే మిగిలారు. గూడెం మొత్తం తరలిపోయి కొత్త గూడెం నిర్మించుకోవడంతో పాత గూడెంలో మొండి గోడలతో శ్మశాన వాతావరణం తలపిస్తోంది. కొత్త గూడెం కొత్త సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లతో కళకళలాడుతోంది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పాండుగూడ.. కోసుపటేల్‌గూడగా మారిన తీరుపై ప్రత్యేక కథనం.

– ఇచ్చోడ(బోథ్)

సండే స్పెషల్



నూతనంగా ఏర్పాటు చేసుకున్న కోసుపటేల్‌గూడ

- పటేల్‌ను కాదని.. సొంతంగా ఊరు పొందిక
- రూ.25 లక్షలతో ఆరు ఎకరాలు కొనుగోలు..
- 28 నివాసాలు.. బడి, గుడి నిర్మాణం
- పాండుగూడ.. కోసుపటేల్ గూడగా..

కట్టుబాటుకు కట్టుకున్న ఇండ్లు వదిలి..

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం పాండుగూడ. అక్కడ నివసించే వారంత ఆదివాసీలే. ప్రశాంత వాతావరణంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే ఆదివాసీలకు మూడేళ్ల క్రితం కట్టుబాట్లు అడ్డువచ్చాయి. గూడెంలోని గ్రామ పటేల్‌కు, గ్రామస్తులకు పొసగడం లేదు. మూఢనమ్మకాలు, గ్రామలెక్కలపై వివాదం తలెత్తింది. దీంతో అప్పటి వరకు కలిసి కట్టుగా ఉన్న గూడెంలో ఒక్కసారిగా వివాదం మొదలైంది. గ్రామస్తులంతా ఒకవైపు, పటేల్.. ఆయన సమీప బంధువు కుటుంబం మరోవైపు అయ్యాయి. ఆదివాసీ సంఘాలు, సార్‌మేడిల కుల పెద్దల ద్వారా పంచాయితీలు కూడా పెట్టుకున్నారు. కానీ పరిష్కారం దొరకకపోగా సమస్య మరింత జటిలమైంది. గ్రామస్తులంతా పటేల్‌ను వ్యతిరేకించడంతో తమ పట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారంతా ఖాళీ చేసి వెళ్లిపోవాలని పటేల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో 28 ఆదివాసీ కుటుంబాలు తాము నిర్మించుకున్న ఇళ్లను సైతం ఖాళీ చేసి పిల్లాపాపలతో, కట్టుబట్టలతో గూడెం ఖాళీచేసి వెళ్లిపోయారు.

కోసుపటేల్‌గూడ ఏర్పాటు

పాండుగూడ నుంచి ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన ఆదివాసీలు మొక్కవోని ధైర్యంతో మరో గూడెం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున జమ చేసి ఆరెకరాల వ్యవసాయ భూమిని రూ.25 లక్షలకు కొనుగోలు చేశారు. నూతనంగా గూడెం ఏర్పాటు చేసుకుని 28 కుటుంబాలు తాత్కాలికంగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. కోసు పటేల్ గూడగా నామకరణం చేశారు. గూడేనికి నూతనంగా పటేల్, దేవారి, మహాజన్, పూజారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాడుబడిన పాండుగూడ...

పాండుగూడను విడిచి 28 కుటుంబాలు వెళ్లి పోవడంతో ఆగూడెం పాడుబడిపోయింది. గూడెంలో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. గూడెంలో పటేల్‌తో పాటు మరో కుటుంబం మాత్రమే నివాసం ఉంటున్నారు. పాండుగూడలో ఉన్న పాఠశాల, ఓవర్‌హెడ్ ట్యాంకు మూతబడి పోయాయి.



పాండుగూడలో పటేల్ నివాసం ఉంటున్న ఇల్లు



ఖాళీ అయిన పాండుగూడ

ట్రస్టు ద్వారా పాఠశాల నిర్మాణం..



అభినవ్‌సర్దార్ ట్రస్టు ద్వారా కోసుపటేల్‌గూడలో నిర్మించిన పాఠశాల

నూతనంగా ఏర్పడిన కోసు పటేల్ గూడలో మూడెళ్ల నుంచి పాఠశాల భవనం లేదు. దీంతో రేకుల కొట్టంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న అభినవ్ సర్దార్ ట్రస్టు చైర్మన్ అభినవ్‌సర్దార్ గ్రామాన్ని సందర్శించారు. రూ.3 లక్షల ఆర్థికసాయం అందించి పాఠశాలకు భవనం నిర్మించి ఇచ్చారు. దీంతో కోసుపటేల్ గూడలో ఆదివాసీ విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటున్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



కోసుపటేట్ గూడలో మూడేళ్ల నుంచి విద్యుత్ సౌకర్యం లేదు. ప్రభుత్వం స్పందించి మా గూడేనికి విద్యుత్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ గ్రామాన్ని ఆదుకోవాలి.

– రావుజీ, కోసుపటేల్ గూడ గ్రామ పటేల్

తాగునీటి సౌకర్యం కల్పించాలి



మా గ్రామానికి ప్రభుత్వం తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం మేమంతా కలిసి వేసుకున్న బోరు నీటిని తాగుతున్నాం. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించాలి.

– కుంర యాదవ్‌రావు, కోసుపటేల్‌గూడ

ఇండ్లు మంజూరు చేయాలి



కోసుపటేల్ గూడలో ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు లేవు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని మా గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

– పెందుర్ భీంబాయి, కోసుపటేల్‌గూడ

అదృష్టంగా భావిస్తున్నా..



గిరిజన విద్యార్థుల చదువు కోసం కోసుపటేల్ గూడలో పాఠశాల నిర్మించే అవకాశం అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. నేను కూడా మారుమూల గిరిజన గ్రామాల్లో కిలో మీటర్ల దూరం వరకు కాలినడకన వెళ్లి చదువుకున్నా.

– అభినవ్ సర్దార్, పాఠశాల నిర్మించిన ట్రస్టు చైర్మన్

వర్గీకరణ పేరుతో దళితులను విడదీస్తున్న మోదీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు

ఖానాపూర్: వర్గీకరణ పేరుతో దళితులను ప్రధాని నరేంద్రమోదీ దళితులను విడదీస్తున్నారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని విశ్రాంతిభవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కలిసిమెలిసి అన్నదమ్ముల్లా ఉన్న దళితుల మధ్య కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ పేరుతో చిచ్చు పెడుతోందన్నారు. కాలం చెల్లిన వర్గీకరణ అంశంపై ఓ వర్గం ఓట్ల కోసం బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పార్లమెంట్‌కు మాత్రమే ఆర్టికల్ 341ను మార్చే అధికారం ఉందన్నారు. ఫిబ్రవరి 25న జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో చలో కాకినాడ రాజ్యాంగ సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

అలేఖ్యకు ఘన నివాళి..

ప్రేమోన్మాది శ్రీకాంత్ చేతిలో ఇటీవల ఖానాపూర్‌లో హత్యకు గురైన యువతి అలేఖ్యకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, నాయకులు ఈదుల్ల ప్రతాప్, మగ్గిడి సురేష్, ద్యావతి రాజేశ్వర్, మ్యాదరి రాజేశ్వర్, తిరుమలేష్, గంగాధర్ ఉన్నారు.

ఆదివాసీలు ఐక్యం కావాలి



ప్రసంగిస్తున్న మర్సుకోల తిరుపతి

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీల మనుగడ కోసం ఆదివాసీ సమూహాలన్నీ ఐక్యం కావాల్సిన అవశ్యకత ఉందని ఆదివాసీ నేత మర్సుకోల తిరుపతి తెలిపారు. నేపాల్ దేశంలో వరల్డ్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెమినార్‌కు వివిధ దేశాల ప్రజాప్రతినిధులు హాజరు కాగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కి చెందిన ఆదివాసీ ఉద్యమ నాయకుడు మర్సుకోల తిరుపతి సైతం హాజరయ్యాడు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ, ఆదిమ గిరిజన తెగలైన కొలాం, తోటి తదితర తెగలు ఎదుర్కొంటున్న వ్యవసాయ, విద్య, వైద్యం సమస్యలను ప్రస్తావించినట్లు ఆయన పేర్కొన్నాడు.

ఉమ్మడిగా ఉద్యమిస్తేనే అలేఖ్యకు న్యాయం

- ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- అలేఖ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ఈ నెల 19న ఖానాపూర్ మహాధర్నా, ఉద్యమ కార్యచరణకు పిలుపు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కుటుంబీకులు, నాయకులు

ఖానాపూర్: ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన అలేఖ్యకు న్యాయం జరగాలన్నా, నిందితుడికి శిక్షపడాలన్నా పార్టీలకు అతీతంగా ప్రజాసంఘాలతో ఉమ్మడిగా ఉద్యమిస్తేనే సత్వర న్యాయం సాధ్యమవుతుందని అఖిల పక్ష, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. పలకరింపులు, పరామర్శలు, ప్రకటనలతో అలేఖ్యకు న్యాయం జరగదని, పోరాటాల నిర్మించి ఉద్యమాలు చేసినప్పుడే అది సాధ్యమవుతుందని అన్నారు. అలేఖ్య తల్లిదండ్రుల శోకం తగ్గాలంటే నిందితుడికి కఠిన శిక్ష పడడమే నిజమైన నివాళి అ న్నారు. ప్రభుత్వం, అధికారులు సైతం నిందితుడికి శిక్షపడేలా చూస్తాం, కుటుంబానికి న్యాయం చేస్తామని మాటలకే పరిమితమయ్యారే తప్ప చేతల్లో చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే సంచలనానికి తెరలేపిన ఖానాపూర్ ఘటనపై ఐక్య ఉద్యమాలు చేసేందుకు ప్రజలంతా తరలిరా వాలన్నారు. ఈ నెల 19న ఖానాపూర్‌లో మహాధ ర్నా నిర్వహించడంతో పాటు అదేరోజు ఉద్యమ కార్యచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు ప్రకటించారు. రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం అలేఖ్య కుటుంబీకులతో కలిసి తహసీల్దార్ శివరాజ్ కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు నందిరామయ్య, రాజ గంగన్న, దయానంద్, నాయిని సంతోశ్, తిలక్‌రావు, జీ రాజు, మేస సతీష్, దుర్గం నూతన్, మునుగూరి భూమన్న, బొమ్మెన సురేశ్, కట్ట శ్రీనివాస్, బిక్కి మురళీకృష్ణ, మునుగూరి ప్రణీత్, జన్నారపు శంకర్, కావలి సంతోశ్, శంభు, నర్సయ్య, తిరుపతి, నవీన్, వెంకటస్వామి, వికాస్, రంజిత్ ఉన్నారు.

‘విశ్వకర్మ’తో చేయూత

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 18రకాల చేతివృత్తులవారికి ఆర్థిక సాయం



భైంసాటౌన్: చేతి వృత్తులవారికి ఆర్థిక చేయూతనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తోంది. మన రాష్ట్రంలో గతేడాది సెప్టెంబర్ 17న ప్రారంభించగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాప్యం నెలకొంది. ఈ పథకం కింద దాదాపు 18రకాల చేతివృత్తుల వారిని అర్హులుగా ప్రకటించింది. సీఎస్‌సీ, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నవారికి ఐదు నుంచి ఏడు రోజుల బేసిక్ ట్రైనింగ్, 15రోజుల అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఉంటుంది. ఆపై రూ.15వేల విలువైన టూల్‌కిట్ అందిస్తారు. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్నవారు బ్యాంక్ లోన్ కోసం దరఖాస్తు చేసుకుంటే 5శాతం వడ్డీతో రూ.లక్ష వరకు రుణం పొందవచ్చు. ఈ లోన్‌ను 18నెలల వాయిదాల్లో చెల్లిస్తే తిరిగి రూ.2లక్షల వరకు రుణం పొందవచ్చు. ఈ పథకంపై చాలామంది చేతివృత్తులవారికి అవగాహన లేక దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పథకం ఉద్దేశం, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ప్రయోజనాలతో ప్రత్యేక కథనం.

దరఖాస్తు ఎలా...

అర్హులైనవారు ఆధార్‌కార్డు, లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్, బ్యాంక్ ఖాతా, రేషన్‌కార్డు ప్రతులతో మీసేవా, సీఎస్‌సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. బయోమెట్రిక్ ద్వారా దరఖాస్తు చేస్తే ఆధార్‌కు లింక్ ఉన్న మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. తద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆపై గ్రామస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మెప్మా అధికారులు చేపడతారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను కేంద్రం పోర్టల్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందికి పంపుతుంది. వారు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన చేపడతారు. అనంతరం అక్కడి నుంచి జిల్లా కమిటీకి పంపుతారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి...

పీఎం విశ్వకర్మ యోజన కింద లబ్ధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. 18 రకాల చేతివృత్తులవారు 18 ఏళ్లు నిండి, కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులు. గ్రామ, పట్టణ స్థాయిలో దరఖాస్తుల పరిశీలన, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి జిల్లాలోనే శిక్షణ అందిస్తాం. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి టూల్‌కిట్, రూ.లక్ష రుణం అందిస్తారు.

– నర్సింగ్‌రావు, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి, నిర్మల్

అర్హులెవరూ..?

పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద వడ్రంగులు, స్వర్ణకారులు, కుమ్మరులు, శిల్పులు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేపల వలల తయారీదారులు, మాలలు అల్లేవారు, మేస్త్రీలు, గంపలు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు, చర్మకారులు, చెప్పుల తయారీదారులు, తాళాలు, ఆయుధ, కవచ తయారీదారులు.. ఇలా 18రకాల వృత్తులవారు పద్దెనిమిదేళ్లు నిండినవారు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ కులానికి చెందిన వారైనా ఆయా వృత్తులు చేస్తున్నవారై ఉంటే పథకానికి అర్హులు. పీఎంఈజీపీ, ముద్ర వంటి పథకాల ద్వారా లబ్ధి పొందనివారై ఉండాలి. అలాగే ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఎంపికైనవారికి ఐదురోజుల పాటు శిక్షణ, శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ ఇస్తారు. అనంతరం 15 రోజులు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్, ఆ తరువాత రూ.15వేల విలువైన టూల్‌కిట్ అందిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పూచీకత్తు లేకుండా 5శాతం వడ్డీతో రూ.లక్ష వరకు బ్యాంకుల్లో రుణం పొందవచ్చు. ఈ రుణాన్ని నిర్ణీత వాయిదాల్లో చెల్లించాలి.

ఆపై రాష్ట్ర కమిటీ పరిశీలన అనంతరం తుది అర్హుల జాబితా ప్రకటిస్తారు. దాని ఆధారంగా శిక్షణ, ఎంపికైనవారికి శిక్షణ, ఈకాలంలో స్టైఫండ్, అనంతరం సర్టిఫికెట్, ఐడీకార్డు అందిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి టూల్‌కిట్, రూ.లక్ష లోన్ అందిస్తారు.

కాలువలో పడి ఎద్దు మృతి

- కంటతడిపెట్టిన బాధిత రైతు



మృతిచెందిన ఎద్దు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు సదర్మాట్ కాలువలో పడ్డ ఎద్దు మృతిచెందింది. రోజులాగే ఎడ్లు కాలువ కట్టపై మేత మేస్తున్న క్రమంలో దాహం వేయడంతో నీటి కోసం ఓ ఎద్దు కాలువలోకి దిగింది. అనంతరం కాలువ ఒడ్డుపైకి ఎక్కేందుకు ప్రయత్నించగా కాలువకు రెండువైపులా సీసీ ప్లాట్‌ఫాం ఉండడంతో ఎక్కేందుకు అవకాశం లేకపోవడంతో ఎద్దు కాలువ దిగువ వైపునకు వెళ్లింది. దీంతో గ్రామ శివారులోని కాలువకు మధ్యలో దిగువన గేట్ల మధ్యన ఇరుక్కుపోయిన మృతిచెందింది. రూ.50వేల పైచిలుకు విలువైన దుక్కిటెద్దు మృతిచెందడంతో బాధిత రైతు గోపి పెద్దరాజన్న కంటతడిపెట్టాడు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాంచా (టి) సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మృతుడు శరీరం గుర్తు పట్టకుండా నుజ్జునుజ్జయింది. నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారుగా 35 నుంచి 40ఏళ్లలోపు ఉంటుందని, ఎవరైనా అదృశ్యమైన వారు ఉంటే వారి కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రూరల్ పోలీసులకు సంప్రదించాలని సూచించారు.

సేవాలాల్ జయంతి ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీవో

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం పరిశీలించారు. ఉత్సవ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా విధులను కేటాయించి వారి వారి విధులు సక్రమంగా నిర్వర్తించేలా చూడాలన్నారు. ఆమె వెంట ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, కమిటీ సభ్యులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



లింగన్న మృతదేహం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన భరిడి కొత్తూర్ లింగన్న(70) పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఏఎస్సై దిగంబర్ వివరాల ప్రకారం... రెండేళ్లుగా లింగన్న కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. మూడు రోజులుగా నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య దేవుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ..

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్ కాలనీకి చెందిన శ్రీరాం ప్రతిక్ (25) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోవింద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీరాం ప్రతిక్ ఆదిలాబాద్ పట్టణంలో మెడికల్ షాప్‌ను కొనసాగిస్తున్నాడు. అతడి తాత మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మనువాడలో పద మూడు రోజుల కిందట మృతి చెందడంతో తల్లి శారదతో కలిసి వెళ్లాడు. తల్లిని అక్కడే ఉంచి అదే రోజు అంత్యక్రియలు పూర్తి కాగానే రణదీవేనగర్‌లోని ఇంటికి వచ్చాడు. అదే కాలనీలో నివాసం ఉంటున్న అమ్మమ్మ రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి భోజనం అందించి ఇంటికి వెళ్లింది. రోజు టీ తాగేందుకు అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లేవాడు. శనివారం ఉదయం రాకపోవడంతో వెళ్లిచూడగా ఉరేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియలేదు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అల్లికోరీ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రతిరోజు మాదిరిగానే యువతి శనివారం వ్యవసాయ పొలానికి వెళ్లింది. అక్కడ పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాల నాయకులు సెడ్మకి ఆనంద్ రావ్, శేషరావ్‌లు రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని యువతి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈవిషయంపై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.